# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :324 సోమవారం 27-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/









## జింబాబ్వేను ఊడ్చేసిన టీమిండియా.

- మూడో టీ20లో భారత్ విజయం
- జింబాబ్వేతో సిరీస్ 3-0తో క్లీన్ స్వీప్
- 3 వికెట్లు తీసిన మయాంక్ యాదవ్

2

జింబాబ్వే పర్యటనను టీమ్ ఇండియా అద్భుత విజయంతో ముగించింది. వరుస ఓటములతో జింబాబ్వేకు వచ్చిన భారత్.. హ్యాట్రిక్ విజయాలతో టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. వైభవ్ సూర్యవంశీ (81) ధనాధన్ అర్ధ సెంచరీతో భారత్ తొలుత 192/5 పరుగులు చేయగా.. బౌలర్లు సమిష్టిగా రాణించటంతో ఛేదనలో జింబాబ్వే 157/7 పరుగులే చేసింది. 35 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది.



## ఉత్తర తెలంగాణకు గేమ్‌ఛేంజర్

- రూ.2,278.14 కోట్లతో ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్
- 2,009.23 ఎకరాల్లో ఎయిర్‌ఫీల్డ్, సివిల్ ఏవియేషన్, కార్గో, ఎంఆర్‌ఓ సదుపాయాల ఏర్పాటు
- ఉత్తర తెలంగాణలో పారిశ్రామిక, పర్యాటక, కార్గో, రక్షణ రంగానికి భారీ ఊతం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)

ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్‌లో ప్రతిష్టాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ. 2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం అవసరాల కోసం, 400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్‌ఓ కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. భూసేకరణతో పాటు ఇప్పటికే ఉన్న రహదారుల మళ్లింపు, 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ మార్పు, విద్యుత్

-మిగతా 2 లో

# దేశ భవిష్యత్‌కు యువశక్తే పునాది

### జై జవాన్ -- జై కిసాన్ --జై యువ అని నినదించండి



- లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తి వయస్సు 21 ఏండ్లకు తగ్గించాలి
- తీర్మానాన్ని ఉభయ సభల్లో అమోదించి కేంద్రానికి పంపిస్తాం
- ఢిల్లీ ఉద్యమ బాధిత కుటుంబాలకు సాయం అందించాలి
- జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)

యువశక్తే దేశ భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తుందని, అందుకే 'జై జవాన్ -- జై కిసాన్ -- జై యువ' అని నినదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్ నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తుల కనిష్ఠ వయోపరిమితి ని 25 ఏండ్ల నుంచి 21 ఏండ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ మీడియా ప్రతినిధులు ఆదివారం హైద రాబాద్‌లో ఆయనను కలిసిన సందర్భంలో పలు విషయాల పై స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదేస్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన సీబీఎస్ఈ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన

-మిగతా 2 లో



## సర్ ఫారం తిరిగివ్వకుంటే ఓటు గల్లంతే!

- ఎన్యూమరేషన్ పత్రాల పూరింపులో ఇక్కట్లు
- కొనసాగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియ
- శాశ్వత వలస, మరణించిన వారి ఓట్ల తొలగింపు
- ఆగస్టు 3లోగా పూర్తి చేసేందుకు ఈసీ కసరత్తు

హైదరాబాద్ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)

ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి ఎన్నికల సంఘం నియమించిన బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) తిరిగివ్వకుంటే ఓటు గల్లంతు కానుంది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ఫారాల పూరింపును కొంత సడలించింది. వివరాలు నింపేందుకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలంలో ప్రస్తుత చిరునామా రాసి ఇవ్వాలని సూచిస్తోంది. అసంపూర్తి వివరాలకు సంబంధించి ఎన్నికల సంఘం ఇచ్చే నోటీసుకు నిర్దేశించిన ఏదేని ఐడీ కార్డుతో బదులివ్వడం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుంది. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి ఎన్నికల సంఘం నియమించిన బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) తిరిగివ్వకుంటే ఓటు గల్లంతు కానుంది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ఫారాల పూరింపును కొంత సడలించింది. వివరాలు నింపేందుకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలంలో ప్రస్తుత చిరునామా రాసి ఇవ్వాలని సూచిస్తోంది. అసంపూర్తి వివరాలకు సంబంధించి ఎన్నికల సంఘం ఇచ్చే నోటీసుకు నిర్దేశించిన ఏదేని ఐడీ కార్డుతో బదులివ్వడం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుంది. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే

-మిగతా 2 లో



## అమెరికా ఆయుధాగారం ఖాళీ!

- ఇరాన్‌పై దాడులకు బ్రేక్
- క్షిపణులు, మందుగుండు సామగ్రి నిల్
- నాలుగు వారాల్లోనే నిల్వలు ఖాళీ .. పెంటగాన్ ఆందోళన.. చర్చలు కొనసాగుతున్నాయి
- అవసరమైతే భారీ దాడులు.. ట్రంప్ ప్రగల్భాలు
- విరామం వ్యవధిపై కొరవడిన స్పష్టత

వాషింగ్టన్: జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)

అమెరికా ఆయుధాగారం ఖాళీ అయిపోయింది. దీంతో ఇరాన్‌పై దాదాపు 13 రోజుల పాటు కొనసాగిన వరుస విమానిక దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా ఆపేశారు. ఇటీవల రోజుల్లో అమెరికా సైన్యం ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై 13వ రాత్రి వరకు వరుసగా దాడులు నిర్వహించింది. హోర్ముజ్ జలసంధి దగ్గర వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడులు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆయుధాగారం ఖాళీ కావడంతో దాడులకు ట్రంప్ విరామం ఇచ్చారని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

ఎడతెరిపి లేని క్షిపణుల వినియోగం

ఈ విరామానికి కారణం కేవలం దౌత్య చర్చలు మాత్రమే కాదని కొందరు అధికారులు పేర్కొన్నారని అంతర్జాతీయ

-మిగతా 2 లో

## విద్యార్థులపై పెల్లెట్ గన్స్ పేలుస్తారా?

- వాటి వాడకాన్ని ఎవరు అనుమతించారు?
- సాధారణ దుస్తుల్లో దాడి చేసింది ఎవరు?
- వారిపై హింసకు ఎవరు బాధ్యులు?
- అమిత్ షాపై రాహుల్ ప్రశ్నల వర్షం
- కేంద్ర హోం మంత్రిపై కాంగ్రెస్ నేత లేఖాస్త్రం
- పార్లమెంట్లో తేల్చుకుంటామని వార్నింగ్

విద్యార్థుల నిరసనలో పెల్లెట్ గన్స్ వినియోగం, బలప్రయోగం, సాధారణ దుస్తుల్లో దాడులు వంటి అంశాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా నిలదీశారు. ఘటనకు బాధ్యులెవరు? పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి ఇచ్చింది ఎవరు? అనే ప్రశ్నలతో లేఖ రాస్తూ, ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రధానంగా లేవనెత్తి ప్రభుత్వాన్ని జవాబుదారిగా నిలబెడతామని హెచ్చరించారు.



2



## పీవోకేలో 47వ రోజుకు చేరిన ఆందోళనలు..

- జూలై 27న ముజఫరాబాద్‌కు లాంగ్‌మార్చ్
- రావల్‌కోట్‌కు భారీగా తరలివచ్చిన నిరసనకారులు
- చర్చలు విఫలమయ్యాయని జేఏఏసీ ప్రకటన
- డిమాండ్లలో ఒక్కటీ నెరవేరలేదన్న నేతలు
- ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా మార్చనున్న కమిటీ
- 1.25 లక్షల మందితో భారీ ప్రదర్శనకు సన్నాహాలు
- పీవోకే పాలనపై స్థానికులకే పూర్తి అధికారం కావాలన్న డిమాండ్
- పాక్ ప్రభుత్వ జోక్యాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులు

న్యూఢిల్లీ


పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలు 47వ రోజుకు చేరాయి. పాకిస్తాన్ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు నిరసనకారులు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో త్వరలో జరగనున్న స్థానిక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిరసనకారులు ముజఫరాబాద్‌కు లాంగ్ మార్చ్ ప్రకటించారు.ఈ నెల 27, సోమవారం లాంగ్ మార్చ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం వేలాది మంది ఆందోళనకారులు రావల్‌కోట్ చేరుకున్నారు. తమ ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా మార్చనున్నట్లు జేఏఏసీ నేతలు ప్రకటించారు. పాక్ ప్రభుత్వంతో ఇంతకాలం జరిపిన చర్చలు విఫలమయ్యాయని, ఇకపై చర్చలు లేవని కమిటీ కీలక నేత సర్దార్ ఉమర్ నజీర్ శనివారం రాత్రి ప్రకటించారు.

-మిగతా 2 లో

# సాగుపై ఎల్ నినో పంజా

### భారీగా తగ్గనున్న పంటల సాగు

- నీటికొరతతో రాష్ట్రవ్యాప్తంగా బీడుగా మారనున్న 32.20 లక్షల ఎకరాలు
- గత సీజన్‌లో 1.39 కోట్ల ఎకరాల్లో పంటల సాగు..
- ఈ సీజన్‌లో 1.07 కోట్ల ఎకరాల వరకే పరిమితం!
- సగానికి సగం తగ్గనున్న వరి సాగు
- వ్యవసాయశాఖ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)

ఎల్ నినో దెబ్బకు రాష్ట్రంలో లక్షల ఎకరాలు బీళ్లుగా మారనున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం భారీగా తగ్గుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. దాదాపు 32 లక్షల ఎకరాల్లో సాగు తగ్గుతుందని ఇప్పటికే అంచనా వేసింది. ఒకవేళ ఎల్ నినో మరింత తీవ్రంగా మారితే భారీగా సాగు తగ్గడం ఖాయమని తేల్చి చెప్పింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఒక నివేదికను రూపొందించింది. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఎల్ నినో కారణంగా ఏఏ పంటల సాగు తగ్గుతుంది.. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా ఏ పంటల సాగు పెరుగుతుంది.. ఏ జిల్లాల్లో ఏ పంటలు సాగు చేయాలనే అంశాలతో నివేదికను రూపొందించింది.

32 లక్షల ఎకరాల్లో తగ్గుదల

-మిగతా 2 లో



## ఇది ఆరంభం మాత్రమే!

- సీజేపీ ప్రయాణం సాగుతుంది : దీప్కే
- విమర్శలతో మరింత బలపడ్డామన్న సీజేపీ వ్యవస్థాపకుడు

2



2

## ప్రధాని క్షమాపణ చెప్పాల్సిందే..

- పార్లమెంట్‌లో ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు
- ఉభయసభల్లో కేంద్రాన్ని నిలదీయాలని నిర్ణయం
- ఇండియా కూటమి పార్టీలతో వ్యూహరచనకు రాహుల్ పిలుపు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# జింబాబ్వేను ఊడ్చేసిన టీమిండియా..

మూడో టీ20లో భారత్ విజయం
జింబాబ్వేతో సిరీస్ 3-0తో క్లీన్ స్వీప్
3 వికెట్లు తీసిన మయాంక్ యాదవ్



జింబాబ్వేతో జరుగుతున్న టీ20 సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం హరారే వేదికగా జరిగిన మూడో టీ20లో టీమిండియా 35 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లలో గెలిచి ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న యువ భారత్.. తాజాగా మూడో టీ20లోనూ గెలిచి ఓటమి లేకుండా పర్యటనను ముగించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 192 పరుగులు చేసింది. అనంతరం జింబాబ్వేను 157 పరుగులకు కట్టడి చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు.. వైభవ్ సూర్యవంశీ అదిరే ఆరంభం ఇచ్చాడు. ఆది నుంచీ దూకుడుగా ఆడిన ఈ 15 ఏళ్ల కుర్రాడు.. ఈజీగా సిక్సర్లు, ఫోర్లు బాదేశాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. హాఫ్ సెంచరీ తర్వాత చకచకా ఫోర్లు కొట్టిన వైభవ్.. సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ 49 బంతుల్లో 81 రన్స్ చేసిన తర్వాత భారీ షాట్‌కు ప్రయత్నించి పెవిలియన్ చేరిపోయాడు. దీంతో అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. ఇషాన్ కిషన్ (29), శ్రేయస్ అయ్యర్ (27), రింకూ సింగ్ (25) రాణించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన జింబాబ్వేకు.. తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. మయాంక్ యాదవ్.. ఇన్నింగ్స్ తొలి బంతికే.. బ్రియాన్ బెన్నెట్‌ను ఔట్ చేశాడు. మిగతా బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బంతులేయడంతో జింబాబ్వేకు ఈజీగా పరుగులు రాలేదు. దీంతో సాధించాల్సిన రన్ రేట్ భారీగా పెరిగిపోయింది. చివరకు జింబాబ్వే.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులకు పరిమితమైంది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ అత్యధికంగా మూడు వికెట్లు తీశాడు. యశ్ ఠాకూర్ 2 వికెట్లు పడగొట్టాడు. అశోక్ శర్మ, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ తమ ఖతాలో వేసుకున్నారు. ఈ విజయంతో టీమిండియా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది.

# ఉత్తర తెలంగాణకు గేమ్‌ఛేంజర్

మొదటి తరువాయి

స్థంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా ఈ పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు. ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగానికి విశేష ఊతం లభించడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో నిరంతర సమన్వయం ఫలితంగానే ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయంతో పాటు అన్ని అడ్డంకుల తొలగింపు ఖర్చును కూడా భరిస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పు పనులను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాంతీయ సమతుల అభివృద్ధియే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌ఛేంజర్‌గా నిలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# అమెరికా ఆయుధాగారం ఖాళీ!

మొదటి తరువాయి

మీడియా వెల్లడించింది. అమెరికా సైన్యం వద్ద ఉన్న ఆధునిక క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థలు వేగంగా ఖాళీ అయిపోయాయని పెంటగాన్ లోపలి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. టోమాహాక్ క్రూయిజ్ క్షిపణులు, జాస్మ్ లాంటి దీర్ఘశ్రేణి ఖచ్చిత క్షిపణులు, పేట్రియాట్, థాడ్ లాంటి వాయు రక్షణ ఇంటర్‌సెప్టర్లు యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారీగా వినియోగించబడ్డాయి.

మందుగుండు నిల్వలు నిల్

కేంద్రీయ వ్యూహాత్మక అధ్యయనాల సంస్థ లెక్కల ప్రకారం కొన్ని ముఖ్యమైన మందుగుండు నిల్వలు ఖాళీ అయిపోయాయి. కొన్ని రకాల క్షిపణులను తిరిగి తయారుచేసి, రంగంలోకి దించడానికి సంవత్సరాలు పట్టవచ్చనే అంచనాలు ఉన్నాయి. ఇందువల్ల ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మరో పెద్ద సంఘర్షణకు అమెరికా సిద్ధంగా ఉండగలదా అనే ఆందోళన కూడా పెరుగుతోందని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.

గతంలో ఇదే విషయంపై ట్రంప్ ఒప్పుకోలు

రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మాత్రం మందుగుండు కొరత లేదని, నిల్వలు బలంగా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ కొందరు అధికారులు వైట్ హౌస్‌కు పూర్తి సమాచారం అందడం లేదని భావిస్తున్నారు. ట్రంప్ ఇంతకు ముందు కూడా యుద్ధం కొనసాగితే నాలుగు వారాల్లో నిల్వలు అయిపోతాయని స్వయంగా ప్రస్తావించిన సందర్భాలు ఉన్నాయి.

ట్రంప్ ఇప్పుడు చర్చలు కొనసాగుతున్నాయని, ఇరాన్ మరింత తీవ్రంగా చర్చల పట్ల ఆసక్తి చూపుతోందని చెప్పారు. అయితే అమెరికా సైన్యం పూర్తి సిద్ధంగా ఉందని, అవసరమైతే మరింత భారీ దాడులు చేయడానికి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నప్పటికీ ట్రంప్ రెండు మార్గాలు సూచించారు. ఒకటి ప్రస్తుత దాడులను కొనసాగించడం లేదా మరింత తీవ్రం చేయడం. రెండోది సంప్రదింపుల ద్వారా ఒప్పందం కుదుర్చుకోవడం. ఇరాన్ ఇంకా పూర్తి సిద్ధంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

# పీవోకేలో 47వ రోజుకు చేరిన ఆందోళనలు..

మొదటి తరువాయి



ఈ నెల 14 నుంచి చర్చలు జరిగాయని, తమ కమిటీ అడిగిన డిమాండ్లలో ఒక్కటి కూడా నెరవేరలేదని నజిర్ అన్నారు. పైగా తమ ఆందోళనలో పాల్గొంటున్నవారిని తీవ్రవాదులుగా గుర్తిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్ ఇంకా అలాగే ఉందన్నారు. ఇంతకాలం అన్ని రకాలుగా చర్చల కోసం ప్రయత్నించామని, ఇప్పుడు ముజఫరాబాద్‌కు మార్చ్ నిర్వహించడం ఒక్కటే తమ ముందున్న అవకాశం అన్నారు. లాంగ్ మార్చ్ నేపథ్యంలో ఉద్యమకారులు భారీ కాన్వాయ్‌లతో మీర్పూర్ సహా ఇతర ప్రాంతాల నుంచి రావల్‌కోట్ చేరుకుంటున్నారు. ఇప్పటికే 1,25,000 మంది ఆందోళనకారులు అక్కడికి చేరుకున్నట్లు అంచనా. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ లాంగ్ మార్చ్ ప్రారంభమవుతుంది. పీవోకేను పాలించుకునే రాజకీయ హక్కు, అధికారం తమకే ఇవ్వాలన్నది అక్కడివాళ్ల ప్రధాన డిమాండ్. పాక్ ప్రభుత్వ జోక్యాన్ని వారు కోరుకోవడం లేదు.

# దేశ భవిష్యత్‌కు యువశక్తే పునాది

మొదటి తరువాయి

సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేటి యువత 21 ఏండ్ల వయస్సులోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచస్థాయి సంస్థలకు సైతం నాయకత్వం వహిస్తోందని వెల్లడించారు. సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏండ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 21 ఏండ్లకు సవరించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 25 నుంచి 21 ఏండ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏండ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంట్ సీట్ల పెంపుదల, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్‌కు అవసరమని ఆయన తెలిపారు.

# సర్ ఫారం తిరిగివ్వకుంటే ఓటు గల్లంతే!

మొదటి తరువాయి

ఉంచుకుంటే మాత్రం ఓటు రద్దవుతుందనే విషయాన్ని అధికారులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటరు నమోదు పత్రాలు నింపడానికి సహాయ పడేందుకు ఎన్నికల సంఘం కొత్తగా మరిన్ని హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసింది.

బీఎల్‌ఓల ఇక్కట్లు....

ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో బాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి సేకరించేందుకు పలుచోట్ల బీఎల్‌ఓలు అవస్థలు పడుతున్నారు. చిరునామాలు మారడం, పట్టణాల్లో ఓటు హక్కు ఉన్నవారికి గ్రామాల్లోనూ ఉండడం వంటి కారణాలతో ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఆరా తీస్తున్నా, కొందరి ఓటర్ల ఆచూకీ లభించడం లేదు. రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్నవారు పట్టణాల్లో ఓటును వదిలించుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే వారు స్వగ్రామాల్లో ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్నారు. దీంతో వారు తిరిగి బీఎల్‌ఓలకు పత్రాలను సమర్పించడం లేదు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగిస్తున్నారు. గ్రామాలను వదిలి వెళ్లిన జాబితాను ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. అందుబాటులో లేని ఇంటి ఓనర్లను ఫోన్లో సంప్రదిస్తున్నారు. కొంతమంది సమయం ఉంది కదా! అని దాట వేస్తుండగా, మరికొందరి ఫోన్లు పని చేయక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పక్కింటి వారితో మాట్లాడి స్థానికంగా ఉండటం లేదని వివరాలు నమోదు చేసుకుం టున్నారు. ఆగస్టు 3తో గడువు ముగుస్తుండటంతో అధికార యంత్రాంగం పూర్తిగా సర్ ప్రక్రియపైనే దృష్టి పెట్టింది.

# విద్యార్థులపై పెల్లెట్ గన్స్ పేలుస్తారా?

-వాటి వాడకాన్ని ఎవరు అనుమతించారు?
-సాధారణ దుస్తుల్లో దాడి చేసింది ఎవరు?
-వారిపై హింసకు ఎవరు బాధ్యులు?
-అమిత్ షాపై రాహుల్ ప్రశ్నల వర్షం
-కేంద్ర హోం మంత్రిపై కాంగ్రెస్ నేత లేఖాస్త్రం
-పార్లమెంట్లో తేల్చుకుంటామని వార్నింగ్



న్యూఢిల్లీ:
జూలై 20న విద్యార్థుల నిరసనలో పోలీసులు చేసిన అమానుష దాడికి బాధ్యులెవరని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిలదీశారు. దీనికి ప్రభుత్వం జవాబుదారీతనానికి ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు తీవ్రమైన ప్రశ్నలతో కూడిన లేఖను అమిత్ షాకు ఆదివారం ఆయన రాశారు. పెల్లెట్ తుపాకుల వాడకాన్ని ఎవరు ఆమోదించారు? ప్రాణాలు తీసేంత బలప్రయోగాన్ని ఎవరు అనుమతించారు? సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తులు ఎవరు? వారు పోలీసులా లేదా ఇతరులా? సమస్యను పరిష్కరించడంలో చర్చల మార్గం ఎందుకు ఎంచుకోలేదు? అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఇంతకు ముందు రాహుల్ గాంధీ అమిత్ షాను నేరుగా బాధ్యుడిగా పేర్కొన్నారు. విద్యార్థులపై జరిగిన హింసకు ఆయనే అనుమతి ఇచ్చారని అన్నారు. పెల్లెట్ తుపాకులు సహా ప్రాణాంతక ఆయుధాల వాడకాన్ని ఆయనే అనుమతించారని చెప్పారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులపై స్వంత దళాలు కాల్పులు జరపడాన్ని అంగీకరించలేమని స్పష్టం చేశారు. ఇది పార్లమెంటులో ప్రధాన అంశం అవుతుందని చెప్పారు. పెల్లెట్ కారణంగా కంటికి గాయం తగిలిన పంతొమ్మిదేళ్ల సాహిల్ అనే విద్యార్థిని తాను కలిసినట్టు రాహుల్ గాంధీ తెలిపారు. పోలీసుల బలప్రయోగంలో ఒక జర్నలిస్టు కూడా గాయపడ్డారని ఆయన ఆరోపించారు.

# సాగుపై ఎల్ నినో పంజా..

మొదటి తరువాయి

ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో సాగు నీళ్లు కరువై పంటల సాగుపై ప్రభావం చూపుతున్నది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ప్రాజెక్టులన్నీ ఖాళీ కుండలను తలపిస్తున్నాయి. వెరసి పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఈ పరిస్థితులతో గత ఏడాదితో పోల్చితే పంటల సాగు భారీగా తగ్గే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గత ఏడాది 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కాగా ఈ సీజన్‌లో ఇది 1.07 కోట్ల ఎకరాలకే పరిమితమయ్యే అవకాశమున్నదని అంచనా వేసింది. అంటే సుమారు 32.20 లక్షల ఎకరాల్లో పంటల సాగు తగ్గుతుందని స్పష్టం చేసింది. గత ఏడాది వానకాలంతో పోల్చితే 23శాతం సాగు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 73.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు నివేదికలో పేర్కొన్నది. గత ఏడాది ఇదే సమయానికి 78 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంటే గత ఏడాదితో చూస్తే 4.64 లక్షల ఎకరాల్లో పంటలు తక్కువగా సాగయ్యాయి.

వరిసాగు సగమే...

ఎల్ నినో ప్రభావం ఎక్కువగా వరి సాగుపై పడుతున్నది. సాగునీరు అధికంగా అవసరముండే పంట కావడం, వర్షాలు లేకపోవడంతో వరి సాగు సగానికి సగం తగ్గే అవకాశం ఉన్నది. గత ఏడాది వానకాలంలో 70 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా ఈ సీజన్‌లో 38.51 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యే అవకాశమున్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అంటే 31.38 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గుతుందని పేర్కొన్నది. ఇప్పటి వరకు 14.09 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడినట్లు తెలిపింది. పత్తి 4.77 లక్షల ఎకరాల్లో తగ్గనున్నది. గత ఏడాది 50.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా ఈ సీజన్‌లో 45.92 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఇక మక్కజొన్న 40వేల ఎకరాల్లో తగ్గే అవకాశమున్నది.

23 జిల్లాలు.. 8831 గ్రామాలు

రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాలు, గ్రామాలు ఎల్ నినో బారిన పడుతున్నాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఇప్పటి వరకు 23 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లుగా పేర్కొంది. ఇక 360 మండలాల్లో లోటు వర్షపాతం, 39 మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం, 183 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఇక గ్రామాల విషయానికొస్తే దాదాపుగా అన్ని గ్రామాలపై ఎల్ నినో ప్రభావం ఉన్నట్లుగా పేర్కొంది. అయితే ఇందులో 7939 గ్రామాలపై మధ్యస్థ ప్రభావం ఉండగా 892 గ్రామాలపై అత్యంత తీవ్ర ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నది. ఇక 2320 గ్రామాలపై తక్కువ ప్రభావం ఉన్నట్లుగా వెల్లడించింది. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ నినో తీవ్ర ప్రభావం చూపుతున్నట్లుగా వ్యవసాయశాఖ వెల్లడించి

# ప్రధాని క్షమాపణ చెప్పాల్సిందే..

-పార్లమెంట్‌లో ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు
-ఉభయసభల్లో కేంద్రాన్ని నిలదీయాలని నిర్ణయం
-ఇండియా కూటమి పార్టీలతో వ్యూహరచనకు రాహుల్ పిలుపు
-విద్యార్థులపై పోలీసు దాడులను నిలదీయాలని నిర్ణయం



న్యూఢిల్లీ
: జంతర్ మంతర్‌లో నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ దాడులపై పార్లమెంట్‌లో ప్రశ్నించాలని విపక్ష పార్టీలు రెడీ అవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పేదాకా పట్టుబట్టేందుకు విపక్షాలు రెడీ అవుతున్నట్టు ఆయా పార్టీల వర్గాలు తెలిపాయి. సోమవారం పార్లమెంట్ ఉభయసభల్లో కేంద్రాన్ని పోలీసుల దాడిపై నిలదీయాలని, ఆ మేరకు పాటించాల్సిన వ్యూహాలపై ఇండియా కూటమి పార్టీలను ఆహ్వానించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాహుల్ గాంధీ కోరారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. 'విద్యార్థులపై పోలీసులను దాడి చేయమని మీరు ఆదేశించారా.. లేదంటే ఎవరు ఆదేశించారో సమాధానం చెప్పాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి' అని లేఖలో రాహుల్ పేర్కొన్నారు. రాజ్యసభలో విద్యార్థుల మీద జరిగిన దాడిపై సోమవారం చర్చ జరపాలని.. ఆ మేరకు సాధారణ కార్యకలాపాలను రద్దు చేయాలంటూ టీఎంసీ రాజ్యసభ ఎంపీ సాగరిక ఘోష్ సభ సెక్రటరికీ లేఖ రాశారు.

# ఇది ఆరంభం మాత్రమే!

-సీజేపీ ప్రయాణం సాగుతుంది : దీప్కే
-కార్యకర్తలు, మద్దతుదారులకు కృతజ్ఞతలు
-విమర్శలతో మరింత బలపడ్డామన్న సీజేపీ వ్యవస్థాపకుడు



న్యూఢిల్లీ
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ'(సీజేపీ)గత 37 రోజులుగా నిర్వహిస్తున్న దీక్షను విరమించింది. అనంతరం సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆదివారం ఉదయం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనకు టైఫాయిడ్ సోకడంతో పాటు జ్వరం 101 డిగ్రీలకు చేరడంతో చివరిరోజు నిరసనకారులను వ్యక్తిగతంగా కలువలేకపోయానని, ఇందుకు క్షమించాలని కోరారుదేశం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ, మద్దతుదారులకూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విమర్శల వల్లే మరింత మెరుగయ్యామని, ఇది ఆరంభం మాత్రమేనని, సీజేపీ ప్రయాణం ముందుకు సాగుతుందన్నారు. సీజేపీ ముఖ్యప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ ఢిల్లీతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా : ప్రహ్లాద్ జోషి



**న్యూఢిల్లీ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని కేంద్ర విద్యాశాఖ మంత్రి గా నియమితులైన ప్రహ్లాద్ జోషి అన్నారు. ఆయన విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఎంతో వినయంతో ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీ కి ధన్యవాదాలు తెలిపారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించిన ఆందోళనలు తీవ్రమైన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి.. ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రిగా ఉన్న ఆయన.. ఇవాళ్టి నుంచి విద్యా శాఖ అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు.

## ఇరాన్‌పై దాడులు నిలిపివేసిన ట్రంప్..

ఆయుధాల కొరతే కారణమా



**న్యూఢిల్లీ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
ఇరాన్‌పై దాడుల్ని అమెరికా ఆపేసింది. శాంతిప్రక్రియ అనంతరం ఇరాన్‌పై అమెరికా వరుసగా 13 రోజులపాటు దాడులు చేసింది. తాజాగా శుక్రవారం నుంచి ఈ దాడుల్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిలిపివేశారు. ఈ అంశంపై అమెరికా అధికారులు స్పందించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలకు అవకాశం ఉండటంతోపాటు, అమెరికా క్షిపణుల నిల్వలు తగ్గిపోవడం వంటివి కారణాలుగా అధికారులు అభిప్రాయపడ్డారు.ఇదే సమయంలో ఇంకా యుద్ధం కొనసాగించడం వల్ల ఈ సంక్షోభం ఇంకా పెరుగుతుందనే భావనతోనే యుద్ధాన్ని నిలిపివేసినట్లు చెబుతున్నారు. దీనిపై ట్రంప్ శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై దాడులు చేయొద్దని ట్రంప్ మిలిటరీని ఆదేశించారు. అప్పటికే దాడులపై రూపొందించిన ప్రణాళికల్ని రద్దు చేయాలని సూచించారు. చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అయితే, ఈ అంశంపై వైట్‌హౌజ్ కార్యాలయం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ, ఈ సంక్షోభాన్ని నివారించేందుకు ట్రంప్ ద్వైపాక్షిక చర్చలకు కట్టుబడి ఉన్నారని, అయినప్పటికీ ఒకవేళ ఇరాన్ కనుక మళ్లీ దాడులకు దిగితే సైనిక చర్యకు వెనుకాడవద్దని ట్రంప్ ఆదేశించినట్లు వైట్‌హౌజ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇరాన్‌తో చర్చలకు అవకాశం కల్పించాలని, అందుకుతగ్గ వాతావరణాన్ని సృష్టించాలని ట్రంప్ భావిస్తున్నారు. ఒకవేళ చర్చలు మళ్లీ విఫలమైతే దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. మరోవైపు మిస్సైల్స్ నిల్వలు క్షీణిస్తుండటం కూడా ఇరాన్‌తో దాడులు నిలిపివేతకు కారణం అని తెలుస్తోంది. దాడులు మరికొన్ని రోజులు కొనసాగితే, క్షిపణుల నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో నిల్వలు తగ్గిపోతున్నాయని సీనియర్ మిలిటరీ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నియంతృత్వ ధోరణితో ఎవరూ ఏదీ సాధించలేరు : అన్నా హజారే



**న్యూఢిల్లీ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
కంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త అన్నాహజారే స్పందించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించడానికి చర్చలు మాత్రమే సరైన మార్గమని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడంతో, నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేమని అన్నారు. ఇప్పటివరకు తాను 22 సార్లు నిరాహార దీక్ష చేశానని, ఎన్నడూ హింసను ఆశ్రయించలేదని అన్నారు. శాంతియుత ఆందోళనలే శాసనపరమైన మార్పులు తీసుకురావడానికి దోహదపడ్డాయన్నారు.తాను చేపట్టిన శాంతియుత నిరసనల కారణంగా 10 చట్టాలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు పౌరుల మాట వినాలని, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని హజారే సూచించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయాల్సి వచ్చినా అందులో ఏ తప్పూ ఉండబోదని పేర్కొన్నారు. మన నిర్ణయాలు ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉండటమే ముఖ్యమన్నారు. మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను సైతం శాంతియుత పద్ధతిలో సాధించుకోవాలని తెలిపారు. హింసాత్మక నిరసనల కంటే శాంతియుత నిరసనలు, చర్చలే ప్రజల్లో పాలనలో మార్పు తీసుకువస్తాయన్నారు. ఎంతటి పరిస్థితులు ఎదురైనా హింసను మాత్రం ఆశ్రయించొద్దని ప్రజలకు, ప్రభుత్వానికి సూచించారు.

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను..

అవినీతి రాజకీయాలే కారణం..
సిద్ధరామయ్య ప్రకటన



**న్యూఢిల్లీ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ లీడర్ సిద్ధరామయ్య కీలక ప్రకటన చేశారు. 2028లో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. తన వయసు, ఆరోగ్యంతోపాటు అవినీతి రాజకీయాలు పెరిగిపోతుండటం కారణంగా తాను 2028 ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించారు. మాండ్య జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో సిద్ధరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు.రాజకీయ రంగం అవినీతిమయంగా మారింది. అందువల్లే నేను 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నా. అయినప్పటికీ నేను రాజకీయాల్లోనే కొనసాగుతాను. ప్రజా జీవితంలో ప్రజల కోసం పని చేస్తా. ప్రజల ఇబ్బందులపై నా గళం విప్పుతా. ప్రజల సంతోషం కోసం పనిచేస్తా. నా వరుణ నియోజకవర్గ ప్రజలు నన్ను మళ్లీ పోటీ చేయమని అడుగుతున్నారు. కానీ, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నా అంటూ సిద్ధరామయ్య ప్రకటించారు. ఇదే అంశంపై తన సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం ఆయన వయసు 79. ఇంతకాలం కాంగ్రెస్ తరఫున సీఎంగా కొనసాగిన సిద్ధరామయ్య ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు.ఆయన తర్వాత డీకే శివకుమార్ కర్ణాటక సీఎంగా బాధ్యతలు చేపట్టారు. సిద్ధరామయ్య 1978 నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. 2028 నాటికి ఆయన రాజకీయాల్లో ఉంటారు. అప్పటికి తన రాజకీయ జీవితానికి 50 ఏళ్లు పూర్తవుతాయి. అదే సమయంలో ఆయనకు అప్పటికి 82 ఏళ్లు వస్తాయి. అందుకే ఆయన వయసురీత్యా కూడా రాజకీయాలకు దూరంగా ఉండాలనుకుంటున్నారు. కర్ణాటక రాజకీయాల్లో సిద్ధరామయ్య ప్రస్థానం చాలా ప్రత్యేకం.

# ఉక్రెయిన్, ఒడెశా పోర్టులో వాణిజ్య నౌకపై దాడి..


ఇద్దరు భారతీయులు గల్లంతు..
ఇద్దరు సురక్షితం



**న్యూఢిల్లీ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
నలుగురు భారతీయులతో వెళ్తున్న వాణిజ్య నౌకపై ఉక్రెయిన్‌లోని ఒడెశా పోర్టు వద్ద దాడి జరిగింది. ఈ దాడిలో ఇద్దరు సిబ్బంది సురక్షితంగా ఉండగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు కీవ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. శనివారం ఈ దాడి జరిగినట్లు వెల్లడించింది. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని రాయబార కార్యాలయం ఆదివారం వివరించింది.ఎంవీ ఏజీఎన్ రంగార్ అనే వాణిజ్య నౌక నల్లసముద్రంలోని ఒడెశా పోర్టులో నిలిచి ఉంచిన సమయంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. ఈ పోర్టు వాణిజ్య రవాణాకు చాలా కీలకం. రష్యా-ఉక్రెయిన్ వార్ సందర్భంగా ఈ నౌకపై, ఈ పోర్టుపై గతంలో కూడా దాడి యత్నం జరిగినట్లు తెలుస్తోంది. దాడి నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని రాయబార కార్యాలయం తెలిపింది. దాడి సమయంలో ఇద్దరు భారతీయులు నౌకలో ఉండగా, ఇద్దరు సురక్షితంగా ఉన్నారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ దాడి ఎవరు చేశారు.. ఎందుకు చేశారు అనే వివరాల్ని మాత్రం భారత అధికారులు వెల్లడించలేదు. ఉక్రెయిన్ వాణిజ్యానికి నల్ల సముద్రంలోని ఒడెశా పోర్టు చాలా కీలకం. ఈ దేశానికి అత్యంత కీలకం కాబట్టి, 2022 ఫిబ్రవరిలో రష్యా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు అనేకాసర్లు ఈ పోర్టుపై దాడి జరిగింది. మరోవైపు నల్ల సముద్రంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ కీలక ప్రకటన చేశారు. నల్ల సముద్రంలో ప్రయాణించే నౌకలపై దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో పని చేసే భారతీయ నౌకాయాన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులను అంచనా వేసుకోవాలని కేంద్రం సూచించింది.

## విద్యార్థుల ఉద్యమం.. ఎన్నికలపై ప్రభావం

**న్యూఢిల్లీ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**



నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా పోరాడి విద్యార్థులు విజయం సాధించారు. ఇది ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి పెద్ద భంగపాటు. జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులు తమ పోరాటాన్ని ప్రపంచం మొత్తం చూసేలా చేశారు. దేశ వ్యాప్తంగా నిరసనలు జరిగేలా వారు పోరాడారు. నరేంద్ర మోదీ అర్ధరాత్రి సెల్ఫీ వీడియో విడుదల చేసేలా వారి పోరాటం సాగింది.తమ ఆశలను మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదని ఈ పోరాటాలతో జెన్-జీ బయటపెట్టింది. వారి ఆలోచనలను అర్థం చేసుకోవడంలో మోదీ ప్రభుత్వం విఫలం అయిందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. యువతలో పెరిగిన ఈ అసంతృప్తి రాబోయే గుజరాత్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని అంటున్నారు.

**యువతలో పెరుగుతున్న అసంతృప్తి..**
జనాభా ఎక్కువ కలిగిన ఈ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు అన్ని పార్టీలకు అత్యంత కీలకం. యూపీ, గుజరాత్‌లో బీజేపీ అధికారంలో ఉంది. విద్యార్థులు సాధించిన విజయంతో ఇప్పుడు బీజేపీ మీద సామాన్యులు కూడా అనేక ప్రశ్నలు సంధిస్తున్నారు. ప్రస్తుతానికి సీజేపీ రాజకీయ పార్టీగా అవతరించలేదు. ఒకవేళ అభిజీత్ దీప్కే రాజకీయాల్లోకి వస్తే అప్పుడు యువతరం అటువైపు ఆసక్తి చూపించే అవకాశాలున్నాయని లండన్ లోని ఎస్‌వోఏఎస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సంజయ్ శ్రీవాస్తవ తెలిపారు. యువత ఇంత పెద్ద ఎత్తున తరలిరావడానికి అనేక కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

## అయోధ్య విరాళాల చోరీలో కొత్త సిట్ ఏర్పాటు



**అయోధ్య, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
అయోధ్య రామాలయ విరాళాల చోరీ, విరాళాల లెక్కింపులో జరిగిన అక్రమాలపై విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను యూపీ ప్రభుత్వం పునర్ వ్యవస్థీకరించింది. కొత్త సిట్ బృందానికి ఐజీ కిరణ్ నేతృత్వం వహిస్తారు. ఈ బృందంలో సభ్యులుగా డీఐజీ సోమెన్ వర్మ, అయోధ్య సీనియర్ ఎస్పీ గౌరవ్ గ్రోవర్ ఉంటారు.అయోధ్య విరాళాల అక్రమ కేసును సీనియర్ పోలీస్ అధికారులతో విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న సుప్రీం కోర్టు.. సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో కొత్త సిట్‌ను ఈ నెల 27లోగా ఏర్పాటు చేయాలని ఆదేశించిన క్రమంలో యూపీ ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. కాగా, విస్తృత స్థాయి ఆర్థిక అవకతవకలు, నిర్మాణ వ్యయాలు, ఆభరణాలు వంటి విలువైన వస్తువుల నిర్వహణను పరిశీలించేందుకు, గత ఐదేండ్లలో ట్రస్ట్ ఖాతాలను తిరిగి ఆడిట్ చేయడం సహా తదుపరి చర్యలు చేపట్టే బాధ్యతను ప్రభుత్వం సిట్‌కి అప్పగించింది.

## విద్యుత్ కాంతుల్లో భారత్ మెరుపులు



**న్యూఢిల్లీ: జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తీసిన ఒక అద్భుతమైన టైమ్‌లాప్స్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. భూమికి సుమారు 400 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణిస్తున్న ఈ అంతరిక్ష కేంద్రం నుంచి రాత్రివేళ భారత్, శ్రీలంక దేశాల రూపురేఖలు అద్భుతంగా ప్రకాశిస్తూ కనిపించాయి.నాసాకు చెందిన జాన్సన్ స్పేస్ సెంటర్‌లో ఎర్త్ సైన్స్ అండ్ రిమోట్ సెన్సింగ్ యూనిట్ అందించిన చిత్రాల ఆధారంగా ఈ ప్రత్యేక దృశ్యాలను రూపొందించారు.

## గంగా నదిలో చికెన్ బిర్యానీ తింటే నేరమా?

-అసమ్మతి గళం తగ్గుతున్నది
-న్యాయ వ్యవస్థ విమర్శలకు అతీతం కాదు: జస్టిస్ భుయాన్



**న్యూఢిల్లీ జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)**
దేశంలో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే స్వేచ్ఛ, అసమ్మతి గళం క్రమంగా తగ్గిపోతున్నదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భుయాన్ ఆందోళన వ్యక్తం చేశారు. భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గంగా నదిలో పడవలో రంజాన్ ఉపవాస విరమణ సమయంలో చికెన్ బిర్యానీ తిన్నారనే నెపంతో 14 మంది ముస్లిం యువకులను అరెస్ట్ చేసి, దాదాపు మూడు నెలల పాటు జైలులో ఉంచిన ఉదంతాన్ని ఈ సందర్భంగా జస్టిస్ భుయాన్ ప్రస్తావించారు.చికెన్ బిర్యానీ తినడం ఎక్కడా నేరం కాదు. గంగా నదిపై చికెన్ తినడాన్ని నిషేధిస్తూ ఎలాంటి చట్టం లేదు. కేవలం ఆ కారణంతోనే వారిని అరెస్ట్ చేసి, మూడు నెలలు జైలులో ఉంచడంసరైనదేనా? అని ప్రశ్నించారు. గాజాలో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ముంబైలోని ఆజాద్ మైదానంలో నిరసన తెలపడానికి సీపీఎం ప్రయత్నించగా, దాన్ని బాంబే హైకోర్టు తోసిపుచ్చిన ఉదంతాన్ని ఆయన గుర్తు చేశారు. న్యాయ వ్యవస్థ కూడా విమర్శలకు అతీతం కాదన్నారు.

# విపక్షాలు చేయలేని పనిని-ఈ దేశ యువత సాధించి ప్రత్యామ్నాయం చూపింది



భారత ప్రజాస్వామ్యంలో గత దశాబ్దానికి పైగా ఒక ప్రశ్న తరచుగా వినిపిస్తూ వచ్చింది. బలమైన మెజారిటీతో అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కొనే రాజకీయ ప్రత్యామ్నాయం ఎందుకు రూపుదిద్దుకోలేకపోతోంది? ఎన్నికల సమయంలో విపక్షాలు కలవడం, ఎన్నికలు ముగిసిన తర్వాత విడిపోవడం, ఒకే సమస్యపై ఒకే స్వరంతో మాట్లాడలేకపోవడం, ప్రజలకు స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానాలను చూపించడంలో విఫలమవడం వంటి కారణాలను అనేక రాజకీయ విశ్లేషకులు పదేపదే ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, రచయితలు, కళాకారులు, పౌర సమాజానికి చెందిన వ్యక్తులు ముందుకు వచ్చి శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచిన ఉద్యమాలు భారత ప్రజాస్వామ్యంలో ఒక కొత్త చర్చకు నాంది పలికాయి. ఈ ఉద్యమాల గురించి వచ్చిన అభిప్రాయాలు ఒక్కలా లేకపోయినా, ప్రజాస్వామ్యంలో యువత పాత్ర ఎంత కీలకమో మరోసారి గుర్తు చేశాయి. అనేక పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, ఈ ఉద్యమాల ప్రత్యేకత నాయకత్వంలో కాకుండా లక్ష్యంలో ఉంది. కోట్ల రూపాయల ఆర్థిక బలం లేకుండా, సంప్రదాయ రాజకీయ పార్టీ నిర్మాణం లేకుండా, అధికార యంత్రాంగం సహకారం లేకుండా, సామాజిక మాధ్యమాలు, స్వచ్ఛంద సేవ, పరస్పర విశ్వాసం, క్రమశిక్షణ ఆధారంగా యువత ఒక జాతీయ చర్చను సృష్టించగలిగింది. ఇదే అంశాన్ని కొందరు "కొత్త తరం పౌర రాజకీయాల ఆరంభం"గా అభివర్ణించారు. రాజకీయ నాయకుల కన్నా సాధారణ విద్యార్థుల సెల్ ఫోన్ వీడియో రికార్డులు ఎక్కువ మందికి సోషల్ మీడియాలో చేరిన కాలంలో సమాచార ప్రజాస్వామ్యం ఎంత శక్తివంతంగా మారిందో ఈ పరిణామాలు స్పష్టం చేశాయి.

సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష, విద్యా విధానాలు, ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువలపై జరిగిన చర్చలకు కొత్త ఊపునిచ్చింది. ఆయనతో పాటు షబానా ఆజ్మీ, ప్రకాశ్ రాజ్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ తదితరులు వివిధ సందర్భాల్లో ప్రజాస్వామ్య సంభాషణ, శాంతియుత నిరసనల అవసరాన్ని నొక్కిచెప్పారు. వారి అభిప్రాయాలతో అందరూ ఏకీభవించకపోయినా, భిన్నాభిప్రాయాలను వినగలగడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అవసరమనే సందేశం విస్తృతంగా చర్చకు వచ్చింది. ఈ ఉద్యమాల గురించి వచ్చిన ప్రధాన వ్యాఖ్య ఏమిటంటే, ఇవి కేవలం రాజకీయ అధికార మార్పు కోసం కాకుండా, విధానాలపై ప్రశ్నలు అడిగే హక్కు కోసం జరిగాయని మద్దతుదారులు వాదించారు. విమర్శకులు మాత్రం ఇటువంటి ఉద్యమాలు కూడా రాజకీయ ప్రభావాలకు అతీతం కావని అభిప్రాయపడ్డారు. ఈ రెండు దృక్కోణాల మధ్య ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపించింది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు; ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత; ప్రశ్నించే విధానం రాజ్యాంగబద్ధంగా ఉండడం పౌరుల బాధ్యత. ఈ ఉద్యమాల్లో అత్యంత విశేషంగా కనిపించిన అంశం క్రమశిక్షణ. సామాజిక మాధ్యమాల్లో అనేక వీడియోలు, చిత్రాలు, ప్రత్యక్ష ప్రసారాలు వైరల్ అయ్యాయి. వాటిలో శాంతియుత నిరసనలు, పాటలు, చర్చలు, రాజ్యాంగ పఠనం, జాతీయ పతాకంతో నిర్వహించిన కార్యక్రమాలు అనేక మందిని ఆకట్టుకున్నాయి. మరోవైపు కొన్ని చోట్ల పోలీసులు తీసుకున్న చర్యలపై ప్రశ్నలు కూడా లేవనెత్తబడ్డాయి. మద్దతుదారులు వాటిని అధిక బలప్రయోగంగా అభివర్ణించగా, ప్రభుత్వ వర్గాలు చట్టం-వ్యవస్థ పరిరక్షణ కోణాన్ని ప్రస్తావించాయి. ఈ భిన్న వాదనల మధ్య స్వతంత్ర దర్యాప్తు, పారదర్శక సమాచారం, న్యాయపరమైన సమీక్ష అవసరమనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఈ ఉద్యమాలు మరో ముఖ్యమైన అంశాన్ని వెలుగులోకి తెచ్చాయి. ఒకప్పుడు ప్రధాన మీడియా మాత్రమే ప్రజాభిప్రాయాన్ని నిర్మించేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. యూట్యూబ్ వేదికలు, స్వతంత్ర డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలు, పౌర జర్నలిజం సమాచార ప్రవాహాన్ని వికేంద్రీకరించాయి. సంప్రదాయ మీడియా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని భావించిన అనేక మంది యువత తమ కథనాలను తామే ప్రపంచానికి చేరవేశారు. ఇదే కారణంగా విదేశీ మీడియా సంస్థలు కూడా కొన్ని అంశాలపై దృష్టి సారించాయి. అయితే విదేశీ మీడియా కథనాలను కూడా విమర్శనాత్మక దృష్టితో చదవాల్సిన అవసరం ఉందని మీడియా పరిశోధకులు గుర్తు చేస్తున్నారు. ఏ మూలమైనా పరిపూర్ణం కాదు; వాస్తవ నిర్ధారణ ఎల్లప్పుడూ అవసరం.

ఈ ఉద్యమాలు భారత ప్రతిపక్షాలకు కూడా ఒక పాఠం నేర్పాయి. ప్రజలు కేవలం అధికార వ్యతిరేక నినాదాలు వినాలనుకోవడం లేదు. సమస్యకు పరిష్కారం ఏమిటి? ప్రత్యామ్నాయ విధానం ఏమిటి? ఆర్థిక, విద్యా, ఉపాధి, వ్యవసాయ, సామాజిక న్యాయం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారు. ఐక్యత అంటే ఎన్నికల పొత్తు మాత్రమే కాదు; ఉమ్మడి విలువలు, ఉమ్మడి కార్యాచరణ, ప్రజలతో నిరంతర సంబంధం కూడా. ఈ విషయంలో యువత అనుసరించిన సమన్వయ పద్ధతిని రాజకీయ పార్టీలు కూడా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

కేంద్ర ప్రభుత్వానికి కూడా ఈ పరిణామాలు కొన్ని విలువైన సందేశాలు ఇస్తున్నాయి. మెజారిటీ ప్రజాస్వామ్యానికి బలం. కానీ ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి ప్రాణం. విమర్శలను దేశద్రోహంగా లేదా రాజకీయ కుట్రగా మాత్రమే చూడకుండా, అందులోని ప్రజా ఆందోళనలను కూడా గుర్తించడం పరిపక్వ ప్రజాస్వామ్య లక్షణం. ముఖ్యంగా విద్య, ఉపాధి, యువత భవిష్యత్తుకు సంబంధించిన విధానాలపై నిర్ణయాలు తీసుకునే ముందు విద్యార్థి సంఘాలు, విశ్వవిద్యాలయాలు, ఉపాధ్యాయులు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో విస్తృత సంప్రదింపులు జరగాలి. సంభాషణ విఫలమైన చోటే ఘర్షణకు అవకాశం పెరుగుతుంది. ప్రతిపక్షాలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అధికార పక్షాన్ని విమర్శించడం మాత్రమే ప్రత్యామ్నాయ రాజకీయాలు కావు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలంటే పారదర్శకత, విశ్వసనీయత, అంతర్గత ప్రజాస్వామ్యం, యువ నాయకత్వానికి అవకాశం, విధానపరమైన స్పష్టత అవసరం. యువతను కేవలం ఎన్నికల సమయంలో ఓటర్లుగా కాకుండా, విధాన రూపకల్పనలో భాగస్వాములుగా చూడాలి.

ఈ దేశ యువతకు చెప్పాల్సిన సందేశం మరింత ముఖ్యమైనది. ఉద్యమం అనేది ఒక రోజు జరిగే కార్యక్రమం కాదు; అది ఒక పౌర సంస్కృతి. కోపం కంటే అవగాహన గొప్పది. వైరల్ పోస్టు కంటే వాస్తవం గొప్పది. నినాదం కంటే అధ్యయనం గొప్పది. ఏ సిద్ధాంతాన్నీ ప్రశ్నించకుండా అనుసరించడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అదే విధంగా ప్రతి విషయాన్నీ కుట్రగా భావించడం కూడా సమాజాన్ని విభజిస్తుంది. కాబట్టి యువత రాజ్యాంగాన్ని చదవాలి, చట్టాలను అర్థం చేసుకోవాలి, విధానాలను పరిశీలించాలి, గణాంకాలను అధ్యయనం చేయాలి, భిన్నాభిప్రాయాలను గౌరవించాలి. ఇదే నిజమైన ప్రజాస్వామ్య పౌరసత్వం.

సామాజిక మాధ్యమాల వినియోగంలో కూడా బాధ్యత అవసరం. తప్పుడు వార్తలు, కృత్రిమ చిత్రాలు, ద్వేష ప్రసంగం, వ్యక్తిగత దూషణలు చివరికి ఉద్యమానికే నష్టం చేస్తాయి. నిజాన్ని బలంగా చెప్పడానికి అబద్ధం అవసరం లేదు. ప్రజల విశ్వాసం కోల్పోయిన ఉద్యమం ఎంత పెద్దదైనా నిలబడదు. కానీ నైతిక బలం ఉన్న ఉద్యమాన్ని పూర్తిగా విస్మరించడం కూడా ఏ ప్రభుత్వానికీ సులభం కాదు. చరిత్ర ఇదే విషయాన్ని అనేకసార్లు నిరూపించింది. భారత ప్రజాస్వామ్య చరిత్రను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి అవినీతి వ్యతిరేక ఉద్యమాల వరకు, సమాచార హక్కు కోసం జరిగిన పోరాటం నుంచి పర్యావరణ ఉద్యమాల వరకు---ప్రజల సంఘటిత స్వరం ఎన్నో విధాన మార్పులకు దోహదపడింది. ప్రతి ఉద్యమం పూర్తిగా విజయవంతమైందని చెప్పలేం. ప్రతి ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా తప్పు అని కూడా చెప్పలేం. కానీ ప్రజల స్వరం వినిపించడం, ప్రభుత్వం స్పందించడం, న్యాయవ్యవస్థ పర్యవేక్షించడం, మీడియా ప్రశ్నించడం---ఇవే ప్రజాస్వామ్య చక్రాన్ని ముందుకు నడిపించే శక్తులు.

చివరికి ఈ పరిణామాలు మనందరికీ ఒక విలువైన సందేశాన్ని అందిస్తున్నాయి. భారత భవిష్యత్తును కేవలం రాజకీయ పార్టీలు మాత్రమే నిర్మించవు. చైతన్యవంతమైన విద్యార్థులు, బాధ్యతగల యువత, నిజాయితీగల ఉపాధ్యాయులు, స్వతంత్ర మీడియా, శాస్త్రీయ దృక్పథం కలిగిన పౌరులు, విమర్శలను వినగలిగే ప్రభుత్వాలు కలిసి నిర్మిస్తాయి. యువత ఏ రాజకీయ పార్టీకి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం లేదు; కానీ ప్రజాస్వామ్యానికి నైతిక దిక్సూచి మాత్రం కావచ్చు. అదే ఈ కాలం మనకు నేర్పుతున్న అత్యంత గొప్ప పాఠం. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలతో ముగిసే వ్యవస్థ కాదు; ప్రతి తరం తన బాధ్యతను గుర్తించి, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ముందుకు వచ్చే నిరంతర ప్రక్రియ. ఆ ప్రక్రియలో భారత యువత శాంతి, క్రమశిక్షణ, ఐక్యత, బాధ్యతతో ముందుకు సాగితే అది ఏ ప్రభుత్వానికైనా, ఏ ప్రతి పక్షానికైనా, మొత్తం దేశానికే ఒక సానుకూల దిశను చూపించే శక్తిగా నిలుస్తుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**
ramkishore.1504@gmail.com

# తులసి వనం అపార్ట్‌మెంట్స్‌లో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం..

**- పాల్గొన్న పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26 (జర్నలిస్ట్ డైరీ) :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి వనం అపార్ట్మెంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... తులసి వనం అపార్ట్మెంట్స్ వారు ఇతర కాలనీల కు ఆదర్శంగా నిలిచారు అని, మొక్కలు నాటి హరిత వనం గా విరాజిల్లలనీ , ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత గా మొక్కలు నాటాలని , మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని,మానవాళి మనుగడకు మొక్కే శ్రీరామ రక్ష అని, సమస్త జీవ కోటికి ప్రాణధారం మొక్కలు అని,అడవుల శాతం పెంచే లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి-వాటిని కాపాడాలిఅని, , కరోన వంటి విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ అవసరం గూర్చి ప్రతి ఒక్కరికి తెలుసునని కావున దీనిని అధిగమించడానికి ప్రతి ఒక్కరు మొక్కలు తప్పనిసరిగా నాటాలని , మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలియచేసారు. అదేవిధంగా ఖాళీ స్థలాలు,రోడ్లకు ఇరువైపులా,అన్ని రకాల అనువైన ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలి అని , నాటిన మొక్కలను తప్పనిసరిగా సంరక్షించాలని, మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనదే అని,మొక్కలను చిన్న పిల్లలు పెంచినట్టు పెంచాలని, పిల్లలు, మహిళలు, యువకులు వృద్ధులను మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడం చాలా అభినందనీయం అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయలు మరియు తులసి వనం అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డుపై కార్యాచరణకు సిద్ధమవుతున్న SDVP జేఏసీ


**లోగో, పోస్టర్ ఆవిష్కరణకు సిద్ధం! నేడు సిద్ధాపూర్ లో భారీ సభ.**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26 (జర్నలిస్ట్ డైరీ) :** సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ పోరాటానికి సిద్ధమవుతున్న సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (ాణవూ-జీూజ) కార్యాచరణకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతోంది. డంపింగ్ యార్డు కారణంగా సిద్దాపూర్, రాజేంద్రనగర్, చేవెళ్ల, మహేశ్వరం నియోజకవర్గాల ప్రజలకు, పరిసర ప్రాంతాల పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు జేఏసీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కమిటీ చైర్మన్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా (ాణవూ-జీూజ) లోగోతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్‌ను సిద్ధం చేశారు. నేడు జేఏసీ తరఫున అధికారికంగా ప్రజల ముందుకు వచ్చి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా డంపింగ్ యార్డు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాన్ని చేపట్టేందుకు జేఏసీ సిద్ధమవుతోందని తెలిపారు..

# విక్రమ్-1 విజయయాత్రలో కీలక పాత్ర పోషించిన నిఖిల్ మద్దూరికి ఘన సన్మానం

**షాద్‌నగర్‌కు చెందిన యువ ఏరోస్పేస్ శాస్త్రవేత్తను అభినందించిన జాతీయ బీసీ సేన నాయకులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26 (జర్నలిస్ట్ డైరీ) :** భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక విజయాన్ని సాధించిన స్కైరూట్ ఏరోస్పేస్‌కు చెందిన విక్రమ్-1 రాకెట్ విజయయాత్రలో కీలక పాత్ర పోషించిన షాద్‌నగర్‌కు చెందిన యువ ఏరోస్పేస్ శాస్త్రవేత్త నిఖిల్ మద్దూరిని జాతీయ బీసీ సేన నాయకులు ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నిఖిల్ మద్దూరి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ పూర్తి చేసి, ఎరాస్మస్ ముండస్ స్కాలర్‌షిప్ ద్వారా జర్మనీలోని జూలియస్ మాక్సిమిలియన్స్ యూనివర్సిటీ, వుర్జ్‌బర్గ్, స్వీడన్‌లోని ఎల్‌టీయూలో స్పేస్‌మాస్టర్ కోర్సు అభ్యసించి డబుల్ మాస్టర్స్ డిగ్రీలు పొందారు. గతంలో భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) లో ఏరోస్పేస్ శాస్త్రవేత్తగా పనిచేశారు. ఈ సమయంలో ఎల్‌సీఏ తేజస్ స్వదేశీ యుద్ధ విమానాలకు సంబంధించిన ప్రాజెక్టుల్లో సేవలందించారు.

ప్రస్తుతం గత ఆరు సంవత్సరాలుగా స్కైరూట్ ఏరోస్పేస్‌లో జీఎన్‌సీ (గైడెన్స్, నావిగేషన్ అండ్ కంట్రోల్) ఇంజనీర్‌గా పనిచేస్తున్న నిఖిల్ మద్దూరి, విక్రమ్-1 మిషన్ కంప్యూటర్‌కు సంబంధించిన కీలకమైన రాకెట్ నావిగేషన్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించారు. రాకెట్‌లోని సెన్సార్ల నుంచి అందే సమాచారాన్ని ఉపయోగించి రాకెట్ యాటిట్యూడ్, పొజిషన్, వేగాన్ని అంచనా వేసే నావిగేషన్ వ్యవస్థ రూపకల్పనలో ఆయన కృషి విశేషంగా నిలిచింది. యువ శాస్త్రవేత్తగా అంతరిక్ష రంగంలో నిఖిల్ మద్దూరి సాధిస్తున్న విజయాలు షాద్‌నగర్ ప్రాంతానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని సన్మానించిన నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జాతీయ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు సుప్ప ప్రకాష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్యాట జయ శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు గిరిబాబు, హాజీపల్లి మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్, భువనచంద్ర తదితరులు పాల్గొని నిఖిల్ మద్దూరిని అభినందించారు.

# నాగారం గోధుమకుంట నిర్మాణ పనులు ప్రారంభం.....



**నాగారం, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ గోధుమకుంటకు అనుబంధమైన టీపీఎస్ కృష్ణా నగర్‌లో ?80 లక్షల వ్యయంతో డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. నాగారం డివిజన్ పరిధిలోని గోధుమకుంటలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంగేటి పర్వత్ రెడ్డి, కౌకుట్ల జీవన్ రెడ్డి, మంచాల ప్రవీణ్, టీపీఎస్ కృష్ణా నగర్ ప్రెసిడెంట్ సంతోష్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కార్తిక్ పాల్గొని పనులను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డ్రైనేజీ మరియు రోడ్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## షాద్ నగర్ చౌరస్తా రోడ్డు వెడల్పు ఎంత అవసరమో, భారత రాజ్యాంగ నిర్మాత

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం కూడా అంతే ముఖ్యం సింగపాగ జంగయ్య మాదిగ, కార్యదర్శి టిఎమ్మార్పీఎస్.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ మున్సిపాలిటీ ముఖ్య కూడలికి అంబేద్కర్ చౌరస్తా అని నామకరణంతో పాటు ఆయన విగ్రహం కూడా చౌరస్తా సెంటర్ లో ఏర్పాటు చేస్తామన్న అధికారులకు మరి ముఖ్యంగా షాద్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వీరపల్లి శంకరన్న గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ...
టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య మాదిగ మాట్లాడుతూ షాద్ నగర్ చౌరస్తా విస్తరణ అభివృద్ధి కోసం గత దీ=గా ప్రభుత్వంలోనే మంజూరు అయినప్పటికీ ఓట్ల కోసం రోడ్డు విస్తరణతో పాటు చటాన్ పల్లి రైల్వే బ్రిడ్జి పనులు చేయలేదని గుర్తు చేశారు.కాని షాద్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి తన ధ్యేయంగా అనుకోని రాజకీయాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి కానీ మనం చేసే పనులు శాశ్వతంగా ప్రజల గుండెల్లో ఉంటాయన్న ఉద్దేశంతో ధైర్యం చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే వీరపల్లి శంకరన్నకే దక్కుతుందని తెలియజేస్తూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే ఎమ్మెల్యేగా వివిధ హోదాలో ఉన్ననాన్న కృతజ్ఞతోనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ (కాన్స) విగ్రహాన్ని రోడ్డు విస్తరణ ముందు రోడ్డు విస్తరణ అనంతరం షాద్ నగర్ మున్సిపాలిటీ చౌరస్తా సర్కిల్ మద్యన ఏర్పాటు చేస్తాదన్న నమ్మకం ఉందని సింగపాగ జంగయ్య మాదిగ అభిప్రాయపడ్డారు. కాని షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోనీ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు ఇప్పుడు వెళ్లవద్దని హైదరాబాద్ రోడ్డు సైడు నుండి, మహబుబ్ నగర్ రోడ్డు సైడు నుండి పరిగి రోడ్డు సైడు నుండి షాద్ నగర్ మున్సిపాలిటీ వరకు ఉన్న అన్ని నిర్మాణ పనులు పూర్తిగా తీసిన తర్వాత కొత్త రోడ్డు పనులు ప్రారంభం అయిన తర్వాతనే అంబేద్కర్ విగ్రహం వద్దకు రాగలరని మనవి.

## వరద నీటి కాల్వ నిర్మాణం,సీసీ రోడ్డు నిర్మాణం పనులను అధికారులతో కలిసి పరిశీలించిన గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26 (జర్నలిస్ట్ డైరీ) :** హాఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ కాలనీ లో గల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రూ. 70 లక్షల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణం మరియు సీసీ రోడ్డు నిర్మాణం పనులను తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ మరియు సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... మంజీరా పైప్ లైన్ రోడ్డు నుండి మసీదు బండ కు వెళ్లే రోడ్డు లో గల రైల్వే అండర్ పాస్ వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, ఉదయం , సాయంత్రం మరింత ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతుంది అని, ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని రూ. 70 లక్షల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు మరియు సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నామని, ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు. ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు. దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలుంను తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని, వరద నీటి కాల్వ నిర్మాణం పనుల పై అధికారులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది అని తెలియచేశారు అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, వరద నీటి కాల్వ నిర్మాణం పనులను, సీసీ రోడ్డు నిర్మాణం పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడానికి శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది.శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని , మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, హాఫీజ్పేట్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.
ఈ కార్యక్రమంలో సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు డిఈ ఆనంద్, ఏఈ భాస్కర్ నాయకులు వెంకటేశ్వర్లు, క్రిషాంక్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లేడు చౌదరిగూడ మండల తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**-అధ్యక్షుడిగా పద్మారం వెంకటేష్ యాదవ్**
**-ప్రధాన కార్యదర్శిగా రమేష్ నాయక్**
**-హాజరైన టీయూజేఏసీ షాద్‌నగర్ అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ సొసైటి జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26 (జర్నలిస్ట్ డైరీ) ;** రంగారెడ్డి జిల్లా, జిల్లేడు చౌదరిగూడ మండల తెలంగాణ మలిదశ ముఖ్య ఉద్యమకారుల సమావేశం చౌదరిగూడ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి టీయూజేఏసీ షాద్‌నగర్ అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు, వారి కుటుంబాల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు న్యాయం చేయడంతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరింత చొరవ తీసుకోవాలని కోరారు.అనంతరం జిల్లేడు చౌదరిగూడ మండల తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పద్మారం వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులుగా వీరన్నపేట్ సలీం, ఇంద్రనగర్ శేఖర్, పద్మారం రాములు, ప్రధాన కార్యదర్శిగా రమేష్ నాయక్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా లచ్చంపేట్ బాలరాజు, కే. నర్సింలు, రావిరాల్ జహంగీర్, జిల్లేటి నవీన్, పద్మారం నరేష్ గౌడ్, గోర్ల బాలయ్య, వనంపల్లి రవి, హరిశ్చంద్ర రెడ్డి, సలహాదారులుగా మాజీ సర్పంచ్ శివ, కోనేరు శ్రీనివాస్, అమృతం, దామోదర్, గౌరవ అధ్యక్షుడిగా ఘనపూర్ సాయిలు యాదవ్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని, ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## కర్ణాటక అక్రమ ప్రాజెక్టులతో తెలంగాణకు నీటి నష్టం

**-బీఆర్ఎస్ బృందం కృష్ణా, భీమా నదులపై ప్రాజెక్టుల పరిశీలన**

**-రైతులకు సాగునీరు అందే వరకు పోరాటం కొనసాగిస్తాం**

**-షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**తెలంగాణ బ్యూరో, జూలై 26 (జర్నలిస్ట్ డైరీ) :** కర్ణాటక ప్రభుత్వం కృష్ణా, భీమా నదులపై నిర్మిస్తున్న అక్రమ చెక్‌డ్యాంలు, బ్యారేజీలు, రిజర్వాయర్లను బీఆర్ఎస్ నాయకుల బృందం ఆదివారం పరిశీలించింది. మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు సీనియర్ నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కూడా బృందంతో కలిసి కృష్ణా, భీమా నదుల పరిధిలోని ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం కృష్ణా, భీమా నదులపై అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు, బ్యారేజీల కారణంగా తెలంగాణకు రావాల్సిన నదీ జలాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఆరోపించారు. హైడ్రాలిక్ గేట్లు ఏర్పాటు చేసి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం వల్ల తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.ఆర్డీఎస్ పరిధిలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల కారణంగా తుంగభద్ర జలాలు తెలంగాణ వైపు రావడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నీటి కొరతతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కర్ణాటక నుంచి నీటి ప్రవాహం నిలిచిపోతే రానున్న యాసంగి సీజన్‌లో తెలంగాణ రైతులు పంటలు సాగు చేసుకునే పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులకు జరుగుతున్న నష్టంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి కర్ణాటకలో నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులపై చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా కృష్ణా, భీమా నదులపై నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, బ్యారేజీలు, చెక్‌డ్యాంల వద్ద వాస్తవ పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. పరిశీలన అనంతరం పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, తెలంగాణ రైతుల పొలాలకు సాగునీరు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

## వైభవంగా అఖండ హనుమాన్ చాలీసా పారాయణం...



**నాగారం, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ పరిధిలో సత్యనారాయణ కాలనీలో వేంచేసియున్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి మరియు శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానం అభయాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగిన అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు, కాలనీ పెద్దలు, ఇతర కాలనీల వాస్తవ్యులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు అనంతరం తీర్థప్రసాద వితరణగావించారు. ఈ పారాయణం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ధన్యవాదములు తెలిపింది.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ శాశ్వతంగా తొలగించాలి...

### మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు, వివిధ పార్టీల నాయకులు....



**నాగారం, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ శాశ్వతంగా ఎత్తివేతపై అవగాహన సదస్సును జవహర్ నగర్ లో ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, జవహర్ నగర్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా డంపింగ్ యార్డ్ వల్ల తీవ్రమైన కాలుష్యం, దుర్వాసన, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా ఎత్తివేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ అవగాహన సదస్సులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, జవహర్ నగర్ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టైక్వాండో జిల్లా ఛాంపియన్షిప్ ఎంపిక పోటీలు...



**నాగారం, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)** డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ మేడ్చల్--మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన "డిస్ట్రిక్ట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ సెలెక్షన్--2026" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పరిగె రామ్ రెడ్డి, ప్రవీణ్ రాజ్, అసోసియేషన్ సభ్యులు శివ కుమార్, సంతోష్, రాజ్ కుమార్ లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. క్రమశిక్షణ, అంకితభావం మరియు నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ నిర్వాహకులను అభినందిస్తూ, క్రీడల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# మన ఓటు కాపాడుకోవడం మన బాధ్యత..





**-స్థానికంగా నివాసముంటున్న ప్రతి ఓటరు ఎస్ఐఆర్ లో వివరాలను నమోదు చేయించండి..**
**-ప్రతి ఓటు పటాన్చెరు అభివృద్ధికి పునాది..**
**-ఎస్ఐఆర్ ప్రక్రియలో పటాన్చెరును రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుదాం..**
**-పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..**

పటాన్ చెరు జూలై 26 (జర్నలిస్ట్ డైరీ)
కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేయించుకుని.. పటాన్చెరును రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడంలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు, కార్మికులకు ఎస్ ఐ ఆర్ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు ఉండడం అత్యంత అవసరమని అన్నారు. ఓటు ఉన్నప్పుడే ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పాటు.. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. పటాన్చెరు భవిష్యత్తుకు ప్రతి ఓటు అత్యంత కీలకమని అన్నారు. మినీ ఇండియాగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాల ప్రజలు జీవనోపాధి నిమిత్తం స్థానికంగా నివసిస్తూ.. ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. వారందరూ విధిగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పాల్గొనాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కులం, మతం, ప్రాంతం విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. అన్ని రాష్ట్రాల ప్రజల పండుగలను, పర్వదినాలను కలిసిమెలిసి నిర్వహిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుపుతున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఎస్ఐఆర్ అంశంపై అవగాహన కల్పించారు. ఇటీవల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాయికోటి రాజును ఎమ్మెల్యే జిఎంఆర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, బాల్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, రామచంద్ర రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వివిధ రాష్ట్రాల ప్రజలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వరద ముంపు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ. 20 కోట్ల నిధులు మంజూరు: మధుయాష్కి గౌడ్

**-చెరువులను సుందరీకణ చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తాని వెల్లడి**
**-సాహెబ్ నగర్ కాప్రాయ చెరువు ను సందర్శించి సమస్యలు తెలుసుకున్న మధుయాష్కి**



బి.యన్ రెడ్డి నగర్, జులై26 (జర్నలిస్ట్ డైరీ)
సాహెబ్ నగర్ కాప్రాయి చెరువు పరిధిలోని కాలనీలకు ముంపు సమస్య లేకుండా.. రూ. 20 కోట్లతో నాలాల నిర్మాణంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఈరోజు ఉదయం సాహెబ్ నగర్, బి.యన్.రెడ్డి డివిజన్ల లో మధుయాష్కి పర్యటించారు. సాహెబ్ నగర్ కాప్రాయి చెరువును సందర్శించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. చెరువు కట్టపై అధ్వాహ్న పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కొందరు ఆకతాయిలు, తాగుబోతులు రాత్రివేళ చెరువు కట్టపై తిరుగుతూ తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, మద్యం, డ్రగ్స్ సేవిస్తున్నారని పరిసర కాలనీవాసులు సమస్య వివరించారు. చెరువు కట్టను సుందరీకరణ చేపట్టాలని, కట్టపై పాడైపోయిన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులను పిలిపించిన మధుయాష్కి చెరువుకట్టపై మందుబాబులు, ఆకతాయిలెవరు రాకుండా చూడాలని, వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జలమండలి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి చెరువు కట్టపై సుందరీకరణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక లైన్ల నిర్మాణంతో పాటు స్థానికులు చెప్పిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంకు సీఎం రేవంత్ రెడ్డిఅధిక నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో కాలనీలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సాహెబ్ నగర్ కాప్రాయి చెరువు పరిసర కాలనీ వాసులకు డ్రైనేజీ, వరద నీటి ముంపు సమస్య లేకుండా.. హరిహర పురం, శాతవాహన నగర్, గాంధీనగర్, స్నేహమై నగర్, అఖిలాండేశ్వర్ నగర్ తదితర కాలనీల మీదుగా వరద నీటి నాలా నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా డ్రైనేజీ లైన్ నిర్మించడం ద్వారా చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టేలా అధికారులతో మాట్లాడతామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హాయంలో చెరువుల పూడిక తీత కోసం మిషన్ కాకతీయ పేరుతో అవినీతికి పాల్పడ్డారని.. చెరువులను కబ్జా చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో చెరువుల సుందరీకరణ, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని పేర్కొన్నారు. గంజాయి డ్రగ్స్ సేవిస్తూ ప్రజలను భయభ్రాంతులను గురి చేసే వారిపై తమ ప్రభుత్వం వివరిస్తుందని.. కాలనీలలో ప్రజలను ఇబ్బందులు పెట్టే అలాంటి వారిపై స్థానిక పోలీసులు కూడా కఠిన చర్యలు తీసుకునేలా సూచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న, సీనియర్ నాయకులు మకుటం సదాశివుడు, డివిజన్ల అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్, పర్వతి గణేష్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ స్టేట్ జనరల్ సెక్రెటరీ వినయ్ పటేల్, నాయకులు సూర్యనారాయణ, విద్యా రెడ్డి, ప్రశాంత్ గౌడ్, భవాని సరస్వతి, మనీష్ గౌడ్, కొత్త శ్రీధర్ గౌడ్, రాంబాబు, నంద కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు రైతు వేదికలో విత్తన మేళా

**వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్**



ఆమనగల్లు,జులై26 (జర్నలిస్ట్ డైరీ)
విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం అందించేందుకు ఆమనగల్లు రైతు వేదిక లో ఈనెల 27 నుంచి 29 వరకు విత్తన మేళ నిర్వహించనున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ మేళాలో తక్కువ నీటితో,తక్కువ కాల వ్యవధిలో పండే కందులు,పెసర, మినుములు, ఆముదాలు, కూరగాయల విత్తనాలు, రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ రైతులను కోరారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలని మెడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి....

నాగారం, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)
నాగారం డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ గంద్ర కమలాకర్ పటేల్ ఆదివారం మెడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తో ఫోన్‌లో మాట్లాడి, నాగారం డివిజన్--5లోని పలు ప్రజా సమస్యలు, ముఖ్యంగా నాగారం--దమ్మాయిగూడ ప్రధాన రహదారి దుస్థితి గురించి వివరించడం జరిగిందని తెలిపారు.
దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్పందించి, సోమవారం సంబంధిత కమిషనర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.
ప్రజా సమస్యల పరిష్కారం కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.

## ఘనంగా చౌదరిగూడ దుర్గమ్మ మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు....

**పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్...**



నాగారం, జూలై 26:-(జర్నలిస్ట్ డైరీ)
మల్కాజ్గిరి కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలోని చౌదరిగూడలో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన దుర్గమ్మ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం సర్ ఇంచార్జి గజ్జలకాంతం, హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మెన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

## కుషాయిగూడలో నూతన బోరు...

**కనీస నీటి అవసరాల కొరకు స్వంత నిధులతో చేయి పంపు బోరింగ్ ఏర్పాటు చేసిన పనగట్ల చక్రపాణి గౌడ్**



నాగారం, జూలై 26:- (జర్నలిస్ట్ డైరీ)
కుషాయిగూడ ప్రాంతంలో తీవ్ర నీటి ఎద్దడి కారణంగా ప్రజలు కనీస అవసరాలకు కూడా నీరు లేక గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న విషయం అందరికీ తెలిసిన విషయమే . ఈ సమస్యపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారం లభించకపోవడంతో, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సామాజిక కార్యకర్త పనగట్ల చక్రపాణి గౌడ్ తన స్వంత నిధులతో చేతి పంపు బోరింగ్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ ప్రజలు నీటి కోసం పడుతున్న ఇబ్బందులను, అలాగే ఎవరైనా మరణించిన సమయంలో కూడా నీటి కోసం పడుతున్న అవస్థలను నేను దగ్గర నుండి చూసానాని అందుకే సామాజిక బాధ్యతగా తొలి ఏకాదశి సందర్భంగా ఈ చేతి పంపు బోరింగ్‌ను ప్రజలకు కనీస అవసరాల కోసం వారికి అందుబాటులోకి తీసుకరావడం జరిగింది అని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేను అలాగే కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని, ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాగుల వాసుదేవ ముదిరాజ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య, సల్ల వెంకటేష్, పండాల గణేష్ గౌడ్, నాలచెరువుల జనార్దన్, పిట్ల రాజు ముదిరాజ్, అంజన్న, జి కృష్ణ కుమార్, అనిల్ యాదవ్, లడ్డు, నిరుడు బాబు, క్యాత దినేష్, నేమూరి సాయి గౌడ్, లవణం శ్రీనివాస్, స్థానిక పెద్దలు యాదగిరి, బాలరాజు, శివకుమార్, హనుమంత్ , వెంకటేష్, బాలకృష్ణ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## ఉరుమడ్లలో హాస్టల్ విద్యార్థులకు యోగా శిక్షణ



చిట్యాల జూలై 26 (జర్నలిస్ట్ డైరీ)
చిట్యాల మండలం ఉరుమడ్ల బీసీ హాస్టల్ విద్యార్థులకు ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు ఆదివారం ప్రత్యేక యోగ, మెడిటేషన్ శిక్షణ నిర్వహించారు. ప్రతినిత్యం యోగ, ధ్యానం చేయడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మస్థైర్యం, అచంచలమైన విశ్వాసం పెరుగుతాయని ఆయన తెలిపారు. శారీరక, మానసిక ఉల్లాసానికి ప్రాణాయామం, సుదర్శన క్రియ ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. వార్డెన్ ప్రసాద్ పాల్గొన్నారు.

Journalist dairy
సోమవారం
27-07-2026
జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## బిజినెస్

# త్వరలోనే బజాజ్ నుంచి తొలి ఎలక్ట్రిక్ బైక్ విడుదల!



బజాజ్ ఆటో ఈవీ మార్కెట్‌లో దూసుకుపోతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో తమ మొదటి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను విడుదల చేయనుంది. చేతక్ స్కూటర్లకు పెరుగుతున్న ఆదరణతో, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నికర లాభం రూ.3,000 కోట్లు దాటింది. డిమాండ్‌కు అనుగుణంగా నెలకు 60,000 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుంటోంది. ఎగుమతుల్లోనూ రికార్డులు సృష్టిస్తోంది.

# సెకండ్ హ్యాండ్ కారు కొంటున్నారా?



కొత్త కార్ల ధరలు పెరగడంతో సెకండ్ హ్యాండ్ కార్లపై ఆసక్తి పెరుగుతోంది. అయితే, సరైన అవగాహన లేకుండా కొంటే నష్టపోవాల్సి వస్తుంది. 3 నుంచి 5 ఏళ్ల పాత కార్లను కొనడం ఉత్తమం, ఎందుకంటే వాటి ఇంజిన్, విడిభాగాలు మంచి కండిషన్‌లో ఉంటాయి, మెయింటెనెన్స్ ఖర్చులు తక్కువగా ఉంటాయి. 7-8 ఏళ్లు దాటిన కార్లను కొనడం మంచిది కాదు, వాటి మెయింటెనెన్స్ ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కారు కొనే ముందు సర్వీస్ హిస్టరీ, ఇంజిన్ కండిషన్, యాక్సిడెంట్ హిస్టరీ, లోన్లు, చలాన్లు, ఆర్సీ, ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికేట్లు తప్పనిసరిగా చెక్ చేసుకోవాలి.

# హోండా నుంచి సరికొత్త కారు..

### -దేశీయ మార్కెట్‌లో మరో మాడల్




**న్యూఢిల్లీ,**
హోండా కార్స్..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను తీసుకొచ్చింది. ప్రీమియం హైబ్రిడ్ ఎస్‌యూవీ జెడ్‌ఆర్-వీ ఈ మాడల్‌ను పరిచయం చేసింది. జపాన్ నుంచి దిగుమతి చేసుకొని దేశీయంగా విక్రయించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.47.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. కేవలం 7.9 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్న ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 22.80 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లేతో అనుసంధానమైన 9 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, పూర్తిస్థాయిలో డ్రైవర్ సైడ్ 10.2 ఇంచుల టచ్‌స్క్రీన్, 12 స్పీకర్లు, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ చార్జింగ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, ఎనిమిది ఎయిర్‌బ్యాగ్‌లు, వెనుక రియర్ పార్కింగ్ సెన్సార్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది.

# బీఎస్ఎన్ఎల్ నయా బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్లు..

### కస్టమర్ల కోసం ప్రత్యేక ప్లాన్

**న్యూఢిల్లీ,**
ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్.. బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల కోసం ప్రత్యేక ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 25 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 700 జీబీ డాటా ప్లాన్‌ను ఆరు నెలల కాలపరిమితితో రూ.1,449కే అందిస్తున్నది. ఈ డాటా ప్లాన్ ముగిసిన తర్వాత డాటా వేగం 2 ఎంబీపీఎస్‌కు పడిపోనున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారిని దృష్టిలో పెట్టుకొని బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్‌ను ఆవిష్కరించింది.నెలవారి ప్లాన్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. నెలకు రూ.259 చొప్పున వసూలు చేస్తున్నది. అలాగే ఆరు నెలలు తీసుకున్నవారికి నెలకు రూ.241 పడనున్నది. దీంతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్, ల్యాండ్‌లైన్ ఫోన్‌ను కొనుగోలు చేయాల్సివుంటుందని తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో మిగతా సంస్థలు నెలకు రూ.1,000 కంటే అధికంగా వసూలు చేస్తున్నారు

BSNL

# ఐపీఎల్ స్టార్లు బెంచ్‌మీదే..
# టీ20ల్లో అరంగేట్రం ఇంకెప్పుడో..!



జింబాబ్వే పర్యటనకు ఎంపికైన భారత కుర్రాళ్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్, హర్ష్ దూబే లకు తుది జట్టులో చోటే దక్కలేదు. వరసగా రెండు విజయాలతో సిరీస్ సొంతమైనందున కనీసం ఆఖరిదైన మూడో మ్యాచ్‌లోనైనా తమకు అవకాశం వస్తుందని ఎదురుచూసిన వీరికి నిరాశే మిగిలింది. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడిన ప్రభ్‌సిమ్రన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ దళంలో కీలకమైన దూబేను అంతదూరం తీసుకెళ్లి.. బెంచ్‌కే పరిమితం చేసింది యాజమాన్యం. దాంతో, టీ20ల్లో ఈ ఇద్దరి అరంగేట్రం ఇంకెప్పుడు? అని అభిమానులు ప్రశ్నిస్తున్నారు.ఐపీఎల్‌లో నిలకడగా రాణించి సెలెక్టర్ల దృష్టిలో పడిన ప్రభ్‌సిమ్రన్ సింగ్, హర్ష్ దూబేలు.. మైదానంలోకి మాత్రం దిగలేకపోయారు. ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్ అనంతరం స్క్వాడ్‌లోకి వచ్చిన ఈ ఇద్దరూ జింబాబ్వే పర్యటనలో తమకు అవకాశం వస్తుందని అనుకున్నారు. కానీ, పేసర్లు అశోక్ శర్మ , యశ్ ఠాకూర్ లకు మాత్రమే తుది జట్టులో చోటు దక్కగా. దూబే, ప్రభ్‌సిమ్రన్‌లకు మాత్రం నిరాశ తప్పలేదు.వికెట్ కీపర్, బ్యాటర్‌గా ఇషాన్ కిషన్ రాణించడం, ఓపెనర్‌గా వైభవ్ సూర్యవంశీ కి మరిన్ని అవకాశాలు ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావించడంతో ప్రభ్‌సిమ్రన్‌కు జట్టు కూర్పులో చోటే దక్కలేదు. అదే.. స్పిన్ ఆల్‌రౌండర్ దూబేకు అయినా అవకాశం ఇస్తారనుకుంటే అతడిని కాదని ఇద్దరు పేసర్లకు డెబ్యూ క్యాప్ అందించారు. దాంతో.. రాబోయే సిరీస్‌లలో అయినా తమకు అవకాశం రాకపోతుందా? అనే అశాభావంతో ఉన్నారు హర్ష్ దూబే, ప్రభ్‌సిమ్రన్.156.33 స్ట్రయిక్ రేటు విధ్వంసక ఓపెనర్‌గా పేరొందొన ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఐపీఎల్‌లో సూపర్ హిట్టయ్యాడు. ప్రతి సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు శు భారంభాలిస్తున్న ఈ చిచ్చరపిడుగు మొత్తంగా 65 మ్యాచుల్లో 156.33 స్ట్రయిక్ రేటుతో 1,815 పరుగులు సాధించాడు. ఈ లీగ్‌లో అతడి పేరిట ఒక శతకం, 13 హాఫ్ సెంచరీలున్నాయి. ఇక సన్‌రైజర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎడమచేతి వాటం స్పిన్నర్ హర్ష్ దూబే.. 12 మ్యాచుల్లో 13 వికెట్లు తీశాడు. అతడి అత్యుత్తమ ప్రదర్శన 3/12.

# ఆస్ట్రేలియాతో 23 ఏళ్లలో తొలి సిరీస్..
# బంగ్లాదేశ్ స్క్వాడ్ ఇదే..!




ఇటీవలే జింబాబ్వే చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన బంగ్లాదేశ్ ఈసారి ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతోంది. ఆగస్టులో కంగారూలతో రెండు టెస్టుల సిరీస్ నేపథ్యంలో ఆదివారం బంగ్లా సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. నజ్ముల్ హుసేన్ శాంటో సారథిగా 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. సీనియర్ ఆటగాడు లిటన్ దాస్, పేసర్లు నహిద్ రానా, తంజిమ్ హసన్ షకీబ్‌లు గాయాల బారిన పడడంతో తొలి టెస్టుకు మాత్రమే స్క్వాడ్‌ను ఎంపిక చేశామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది.

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో భాగంగా పటిష్టమైన ఆస్ట్రేలియాను ప్రధాన పేసర్లు లేకుండానే బంగ్లాదేశ్ ఢీకొట్టనుంది. ఇటీవల నిలకడగా రాణిస్తున్న నహిద్ రానా, తంజిమ్ హసన్ షకీబ్‌లు గాయాలతో అందుబాటులో లేరు. అలానే.. సీనియర్ బ్యాటర్ లిటన్ దాస్ సైతం తొడ కండరాల గాయం నుంచి కోలుకుంటున్నాడు. దాంతో, వీరు ఫిట్‌నెస్ సాధించేందుకు సమయం పట్టనుంది. అందుకని ముందుగా తొలి టెస్టుకు మాత్రమే సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. నజ్ముల్ హుసేన్ శాంటో కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ఆదివారం ఎంపిక చేశారు.

**ఆగస్టు 13న**
గత 23 ఏళ్లలో తొలిసారి కంగరూ గడ్డపై టెస్టులు ఆడేందుకు వెళ్తోంది బంగ్లాదేశ్. ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని ఆసీస్‌తో ఆగస్టు 13న డార్విన్ మైదానంలో బంగ్లా తలపడనుంది. అనంతరం ఆగస్టు 22న మెక్‌కేలో ఇరుజట్ల మధ్య రెండో టెస్టు జరుగనుంది. రెండో మ్యాచ్‌కు స్క్వాడ్‌ను త్వరలోనే వెల్లడిస్తామని బీసీబీ పేర్కొంది.

చివరిసారిగా బంగ్లా 2003లో ఆసీస్ పర్యటనకు వెళ్లింది. దాంతో, ఈ టెస్టు సిరీస్‌కు ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. బంగ్లాదేశ్ నాలుగో ప్లేస్‌లో ఉంది.

**బంగ్లాదేశ్ స్క్వాడ్ (తొలి టెస్టు కోసం):** నజ్ముల్ హుసేన్ శాంటో(కెప్టెన్), మెహిది మిరాజ్(వైస్ కెప్టెన్), ముష్ఫికర్ రహీం, అమితె హసన్, సౌమ్యా సర్కార్, షద్మన్ ఇస్లాం, మొమినుల్ హక్, జకీర్ అలీ, తంజిద్ హసన్, తైజుల్ ఇస్లాం, తస్కిన్ అహ్మద్, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్, ఎబడాట్ హుసేన్, మస్ఫిక్ హసన్.

## స్పోర్ట్స్

# ఇంగ్లండ్‌కు షాక్..
# మళ్లీ అగ్రస్థానంలో టీమిండియా..!




అంతర్జాతీయ టీ20 ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల జట్టు మళ్లీ అగ్రస్థానానికి దూసుకొచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో వైట్‌వాష్‌తో రెండుకు పడిపోయిన టీమిండియా.. రెండో టీ20లో జింబాబ్వే పై అదిరే విజయంతో నంబర్ 1 ర్యాంకు కైవసం చేసుకుంది. వరసగా రెండు సిరీస్‌లలో ఓటమితో విమర్శలపాలైన శ్రేయాస్ అయ్యర్ సేన ఆఫ్రికా జట్టుపై గొప్పగా ఆడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో మరో గేమ్ ఉండగానే సిరీస్ గెలుపొంది ఇంగ్లండ్‌ను వెనక్కినెట్టేసింది.టీ20 వరల్డ్‌కప్ ఛాంపియన్ భారత జట్టు మళ్లీ నంబర్ 1 ర్యాంకకు ఎగబాకింది. ఇంగ్లండ్ పర్యటనలో క్లీన్‌స్వీప్ నుంచి తేరుకున్న టీమిండియా హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జింబాబ్వేను వరసగా రెండు మ్యాచుల్లో చిత్తు చేసి అగ్రస్థానంలో నిలిచింది.

భారత టీ20 సారథిగా శ్రేయాస్ అయ్యర్ మొట్టమొదటి సిరీస్ విజయం సాధించగా.. హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్ రెండో ర్యాంకుకు పడిపోయింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో16,088 పాయింట్లు.. ఇంగ్లండ్ పేరిట 10,186 పాయింట్లు మాత్రమే ఉన్నాయి.

**టాప్-5 జట్లు ఇవే**

1. భారత్ -- 16,088 పాయింట్లు, 268 రేటింగ్
2. ఇంగ్లండ్ -- 10,186 పాయింట్లు, 268 రేటింగ్
3. ఆస్ట్రేలియా -- 9,868 పాయింట్లు, 260 రేటింగ్
4. న్యూజిలాండ్ -- 12,348 పాయింట్లు, 247 రేటింగ్
5. దక్షిణాఫ్రికా -- 11,717 పాయింట్లు, 244 రేటింగ్



చీరలో మరింత అందంగా మెరిసిపోతున్న సంయుక్తా మీనన్..

## రామోజీ ఫిలింసిటీలో ఎన్టీఆర్ డ్రాగన్ టీం..

### ఫ్యాన్స్‌కు ఇక పూనకాలేనట..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటి డ్రాగన్ . ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ ఇప్పటికే నెట్టింట హైప్ క్రియేట్ చేస్తోంది. స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో బూట్‌కట్ ట్రౌజర్స్ వేసుకున్న జూనియర్ ఎన్టీఆర్ చేతిలో పదునైనా ఆయుధాన్ని పట్టుకోగా.. చుట్టూ మంటలు, పొగను చూడొచ్చు. మోకాళ్లపై కూర్చొని యాక్షన్ ప్యాక్‌డ్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు.తాజాగా తారక్ ఫ్యాన్స్ కోసం అదిరిపోయే వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం ఎన్టీఆర్ అండ్ టీం రామోజీ ఫిలింసిటీలో ఉంది. యూరోపియన్ స్టైల్ బ్యాక్‌డ్రాప్‌లో వేసిన ప్రత్యేక సెట్‌లో కీలక యాక్షన్ ఎపిసోడ్‌ను షూట్ చేస్తున్నారన్న వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌పై వచ్చే కొన్ని హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కిస్తున్నారు. ఈ సెట్ యూరోపియన్ వాతావరణాన్ని రీక్రియేట్ చేసేలా విజువల్ అప్పీరియన్స్ సినిమాలో కనిపించబోతుదంట. తాజా సీక్వెన్స్ డ్రాగన్ సినిమాకు వన్ ఆఫ్ ది మేజర్ హైలెట్స్‌లో ఒకటిగా నిలువడం పక్కానట. జక్కన్న తర్వాత ప్రశాంత్‌నీల్ ఈ సారి ఎన్టీఆర్‌తో గ్లోబల్ బాక్సాఫీస్‌ను మరోసారి బద్దలు కొట్టించడం గ్యారంటీ అని తాజా అప్‌డేట్ చెప్పకనే చెప్పేస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ కో ప్రొడ్యూస్ చేస్తోంది. కేజీఎఫ్ ఫేం రవి బస్రూర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## ‘స్పిరిట్’లో కత్రినా కైఫ్ ..


### ప్రభాస్ సినిమాపై బాలీవుడ్‌లో హాట్ టాక్ నిజమేనా?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ‘స్పిరిట్’. అనౌన్స్‌మెంట్ జరిగిన నాటి నుంచే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించి బాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన వార్త వైరల్‌గా మారింది. అదేంటంటే.. స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం. ‘స్పిరిట్’లో ఇప్పటికే హీరోయిన్‌గా తృప్తి డిమ్రి నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మరో హీరోయిన్‌గా కాకుండా, కథలో కీలక మలుపు తీసుకొచ్చే ప్రత్యేక పాత్ర కోసం కత్రినా కైఫ్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు ముంబై సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.స్క్రీన్‌పై ఆమె కనిపించే సమయం పరిమితంగానే ఉన్నప్పటికీ, కథను ప్రభావితం చేసే పవర్‌ఫుల్ రోల్‌లో కత్రినా కనిపిస్తారని టాక్ వినిపిస్తోంది. ఆమె పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని కూడా వార్తలు వస్తున్నాయి. ప్రారంభంలో ఈ సినిమాలో హీరోయిన్‌గా దీపికా పదుకొణె పేరు వినిపించింది. అయితే ఆమె ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న తర్వాత తృప్తి డిమ్రిని హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఇప్పుడు కత్రినా కైఫ్ పేరు తెరపైకి రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. కత్రినా కైఫ్ గతంలో విక్టరీ వెంకటేష్‌తో ‘మల్లీశ్వరి’, నందమూరి బాలకృష్ణతో ‘అల్లరి పిడుగు’ చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత ఆమె పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితమయ్యారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆమె స్పిరిట్ లో నటిస్తే, అది ఆమెకు చాలా కాలం తర్వాతి తెలుగు సినిమా అవుతుంది.ప్రస్తుతం కత్రినా కైఫ్ ‘స్పిరిట్’లో నటిస్తున్నారనే వార్త సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు కత్రినా కైఫ్ గానీ, చిత్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా గానీ, నిర్మాణ సంస్థ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ వార్తపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



## మిరాయి భామ కొరియన్ గాళ్‌గా మారితే..

### ట్రెండింగ్‌లో రితికానాయక్ స్టిల్స్



అశోకవనంలో అర్జుణ కళ్యాణం సినిమాలో సెకండ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరిసి తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది రితికా నాయక్. ఆ తర్వాత మిరాయి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఈ బ్యూటీ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టింది. వీటిలో ఒకటి డ్యుయెట్ కాగా.. మరో సినిమా కొరియన్ కనకరాజు. ఇండో-కొరియన్ హార్రర్ కామెడీ నేపథ్యంలో వరున్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం కొరియన్ కనకరాజు.మేర్లపాక గాంధీ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీ ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ భామ రీసెంట్‌గా కొన్ని ఫోటోలను నెట్టింట దర్శనమిచ్చి అందరినీ మెస్మరైజ్ చేస్తోంది. వైబ్రాంట్ ఫ్లోరల్ స్కర్ట్, వైట్ షర్ట్ వేసుకున్న రితికా నాయక్ గోల్డెన్ కలర్ జ్యువెలరీతో తళుక్కున మెరుస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. మిరాయి బ్యూటీ కొరియన్ గర్ల్‌గా మారితే ఇలా ఉంటుందని చెప్పకనే చెబుతూ కుర్రకారు గుండెలను పిండేస్తుంది రితికానాయక్. చబ్బీచబ్బీగా క్యూట్ లుక్ స్టిల్స్ సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి.

## సక్సెస్ ఫెయిల్యూర్‌తో సంబంధం లేకుండా కియారా జోరు

బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ ఫెయిల్యూర్‌తో సంబంధమే లేదు.. ఇప్పుడు ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద భారీ పాన్ ఇండియా సినిమా ఎనౌన్స్ అయితే.. అందులో హీరోయిన్‌గా కియారా అద్వానీ పేరే వినిపిస్తోంది. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఏ ఇండస్ట్రీ అయినా, ఏ స్టార్ హీరో అయినా.. మేకర్స్ ఫస్ట్ ఛాయిస్ ఈ బ్యూటీనే. మరి అంతలా ఈ బాలీవుడ్ భామ పాన్ ఇండియా ప్రాజెక్టులను ఎలా పట్టేస్తోంది? అసలు కియారా లైనప్‌లో ఉన్న ఆ క్రేజీ సినిమాలేంటి? యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో భారీ మైథలాజికల్ మూవీ రెడీ అవుతోంది. ‘గాడ్ ఆఫ్ వార్’ అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ పౌరాణిక చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తారన్న టాక్ వినిపిస్తోంది. గతంలో కియారా చేసిన రెండు తెలుగు సినిమాలు నిరాశపరిచినా, ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పటికీ టాలీవుడ్ క్రేజీ ప్రాజెక్ట్స్ విషయంలో ఈ బ్యూటీ పేరు ఫస్ట్ తెర మీదకు వస్తోంది. తెలుగులో రామ్ చరణ్‌కు జోడీగా నటించిన రెండు సినిమాలతో పాటు, తారక్ నటించి హిందీ మూవీ వార్ 2తో తెలుగు ఆడియన్స్‌కు దగ్గరయ్యారు కియారా అద్వానీ. అయితే ఆ సినిమాలన్నీ డిజాస్టర్ కావటంతో దక్షిణాదిలో బిగ్ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కియారాను భారీ చిత్రాల్లో కాస్ట్ చేసేందుకు ఇంట్రస్ట్ చూపిస్తున్నారు సౌత్ మేకర్స్. ప్రజెంట్ గ్లోబల్ మూవీ టాక్సిక్‌లో హీరోయిన్‌గా నటిస్తున్నారు కియారా. ఆగస్టు 26న రిలీజ్‌కు రెడీ అవుతున్న ఈ మూవీతో సౌత్‌లో తొలి సక్సెస్ దక్కుతుందన్న నమ్మకంతో ఉన్నారు. బాలీవుడ్‌లోనూ క్రేజీ ప్రాజెక్ట్స్ ఈ బ్యూటీ ఖాతాలో ఉన్నాయి. ఇంత బిజీలోనూ కొత్తగా ఏ ప్రాజెక్ట్ ఎనౌన్స్ అయినా అందులో ఫస్ట్ లీడ్‌గా కియారా పేరే తెర మీదకు వస్తోంది.

## ‘కహానీ-3’లో యామిగౌతమ్



‘ఆర్టికల్ 370’ చిత్రానికిగాను ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ పురస్కారాన్ని అందుకొని అందరి దృష్టిని ఆకర్షించింది కథానాయిక యామిగౌతమ్. తాజాగా ఆమె పాపులర్ బాలీవుడ్ ఫ్రాంఛైజీ ‘కహానీ’ మూడో భాగంలో నాయికగా ఖరారైంది. సుజయ్‌ఘోష్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ఫ్రాంఛైజీ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలందుకుంది.‘కహానీ-3’ కోసం దర్శకుడు సుజయ్‌ఘోష్ గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తొలి రెండు భాగాల్లో నటించిన విద్యాబాలన్ మూడో భాగంపై అంతగా ఆసక్తి చూపించకపోవడంతో ఈ ప్రాజెక్ట్‌లో జాప్యం జరిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంఛైజీలోకి యామిగౌతమ్ ఎంట్రీ ఇస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. తొలి రెండు భాగాల కంటే భిన్నమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ తుదిదశకు చేరుకుందని మేకర్స్ తెలిపారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465